
సాక్షి

భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం । 12 । మే । 2023



చెట్లు కూలి.. స్తంభాలు విరిగి..

జిల్లాలో గురువారం ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. పలుచోట్ల చెట్లు విరిగిపడగా, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. 10లో



అప్రమత్తతే మేలు

చెరువులు, నదుల్లో ఈతకు వెళుతున్న యువకులు నీటి లోతు అంచనా వేయలేక వాటిలో మునిగి మృత్యువాత పడుతున్నారు. 10లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 42° / 25°

జిల్లాలో శుక్రవారం ఎండ ప్రభావం తీవ్రంగా కనిపిస్తుంది. పగటి వాతావరణం వేడిగా ఉంటుంది. సాయంత్రం కొన్నిచోట్ల జల్లులు పడతాయి.

న్యూస్‌రీల్

నేత్రపర్వం.. రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన



అమ్మవారికి పుష్పార్చన చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: మండలంలో కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి గురువారం వైభవంగా సువర్ణ పుష్పార్చన నిర్వహించారు. 108 సువర్ణ పుష్పాలతో ప్రత్యేక పూజల అనంతరం హారతి, మంత్రపుష్పం, నివేదన సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మహిపతి రామలింగం, ధర్మకర్తలు చింతా నాగరాజు, గంధం వెంగళరావు, అర్చకులు పద్మనాభశర్మ, రవికుమార్‌శర్మ పాల్గొన్నారు. కాగా, అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి సుజాతనగర్ మండలం వేపలగడ్డకు చెందిన తాతాపురి అంజలి రూ.5,116 అందజేసినట్లు ఈఓ ఎస్.రజినీకుమారి తెలిపారు.

18న రుద్రహోమం..

మాస శివరాత్రి సందర్భంగా ఈనెల18న పెద్దమ్మతల్లి ఆలయంలో రుద్రహోమం నిర్వహించనున్నట్లు ఈఓ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాల్గొన దలచిన భక్తులు రూ.1,516 చెల్లించి గోత్రనామాలను నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 98669 23261, 63034 08458 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

రైల్వేలైన్ నిర్వాసితులు ఇళ్లు ఖాళీ చేయాలి

అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

మణుగూరు టౌన్ : బీటీపీఎస్ రైల్వేలైన్ నిర్వాసితులు తక్షణమే ఇళ్లు ఖాళీ చేయాలని అదనపు కలెక్టర్ కర్నాటి వెంకటేశ్వర్లు సూచించారు. గురువారం ఆయన మణుగూరు తహసీల్దార్ కార్యాలయంలో మాట్లాడుతూ.. రైల్వే లైన్ నిర్మాణంలో ఇళ్లు కోల్పోతున్న సమితిసింగారం, రామానుజవరం, మణుగూరు, తిర్లాపురం నిర్వాసితులకు భూసేకరణ చట్టం ప్రకారం పూర్తి స్థాయిలో నష్టపరిహారం అందిస్తామని అన్నారు. ఇప్పటికే రామానుజవరం, తిర్లాపురం గ్రామాల్లో పలువురి ఇళ్లను ఖాళీ చేయించామని, మిగతా గ్రామాల నిర్వాసితులు సైతం ఇళ్లు ఖాళీ చేయాలని అన్నారు. లేదంటే కూల్చివేస్తామని చెప్పారు. సమావేశంలో తహసీల్దార్ కె. నాగరాజు పాల్గొన్నారు.

పాల్వంచ మున్సిపల్ కమిషనర్‌కు ఉద్యోగోన్నతి




శ్రీకాంత్

పాల్వంచ : పాల్వంచ మున్సిపల్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్‌కు ఉద్యోగోన్నతి లభించింది. గ్రేడ్–1 మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న ఆయనకు స్పెషల్ గ్రేడ్ కమిషనర్‌గా ప్రమోషన్ ఇస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ అధికారులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, శ్రీకాంత్‌ను పలువురు అధికారులు, సిబ్బంది అభినందించారు.

ఇల్లెందుకు రండి!

ఎంపీ కవితకు 'అసంతృప్త' నేతల ఆహ్వానం

- సరికొత్త కార్యాచరణతో నాయకులు, కార్యకర్తలు
- మహబూబాబాద్ కేంద్రంగా జోరుగా మంతనాలు
- సిట్టింగ్ ఎమ్మెల్యే హరిప్రియకు చిక్కులు



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఇల్లెందు సిట్టింగ్ ఎమ్మెల్యే హరిప్రియానాయక్‌కు ఎన్నికల సంవత్సరంలో ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఓ వైపు ఆత్మీయ సమ్మేళనాలు జరుగుతున్నా స్థానిక బీఆర్ఎస్ పార్టీలో అసంతృప్తి చల్లారడం లేదు. ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా జట్టు కట్టడంతో పాటు రాబోయే ఎన్నికల్లో ప్రత్యామ్నాయం ఏంటనే అంశంపై అసమ్మతి నేతలు దృష్టి సారించారు. ఈ నియోజకవర్గం నుంచి గత అసెంబ్లీ ఎన్నికల్లో హరిప్రియ కాంగ్రెస్ నుంచి గెలిచి, ఆ తర్వాత టీఆర్ఎస్‌లో చేరారు. ఆరంభంలో ఆమె వెంట ఉన్న కాంగ్రెస్ కేడర్ కొంత, టీఆర్ఎస్ పార్టీలో మెజార్టీ శ్రేణులు హరిప్రియ నాయకత్వంలో పని చేసేందుకు మొగ్గు చూపాయి. అయితే ఏడాదిగా పరిస్థితిలో మార్పు వచ్చింది. మండలాలు మొదలు నియోజకవర్గ కేంద్రమైన ఇల్లెందు మున్సిపాలిటీ వరకు అన్ని చోట్లా అసంతృప్తులు పెరిగిపోతూ వచ్చారు. వారికి సరైన సమయంలో సర్దిచెప్పడంలో హరిప్రియ విఫలమయ్యారనే వాదనలు పార్టీలో నేతల్లో వినిపిస్తున్నాయి. దీంతో ఇక్కడ పార్టీలో నేతల మధ్య వర్గపోరు తారాస్థాయికి చేరింది. ఏ ఒక్కరూ వెనక్కు తగ్గే పరిస్థితి కనిపించడం లేదు. ఈ వ్యవహారం చినికిచినికి గాలివానలా మారి.. చివరకు ఎమ్మెల్యే హరిప్రియ భర్త హరిసింగ్ కారణంగానే పార్టీలో అంతర్గత కుమ్ములాటలు ఎక్కువయ్యాయనే భావన నియోజకవర్గంలో నెలకొంది. ఇరు వర్గాలను ప్రోత్సహిస్తూ పార్టీలో తనకు ఎదురులేకుండా చేయాలనే వ్యూహంతో హరిసింగ్ పావులు కదుపుతున్నారనే అభిప్రాయం పార్టీలోని ద్వితీయ శ్రేణి నేతల్లో బలపడుతోంది.

మూడు జిల్లాల పరిధిలో..

ఇల్లెందు నియోజకవర్గం భద్రాద్రి, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో విస్తరించి ఉంది. ఇటీవల మండలాల వారీగా బీఆర్ఎస్ నేతలు ఎమ్మెల్యే హరిప్రియతో సంప్రదింపులు చేయకుండానే ఆయా జిల్లాల బీఆర్ఎస్ అధ్యక్షులను కలిశారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిని వివరించేందుకే కలిసినట్టు బయటకు చెప్పినా.. అంతర్గతంగా జరిగింది వేరని తెలిసింది. ఎమ్మెల్యే భర్త హరిసింగ్ వ్యవహార శైలి కారణంగా నియోజకవర్గంలో వర్గపోరు రోజురోజుకూ పెరుగుతోందని, ఫలితంగా పార్టీకి ఇబ్బందులు ఎదురవుతాయనే అంశాన్ని మండలాల నేతలు జిల్లా అధ్యక్షుల వద్ద వెల్లడించినట్టు సమాచారం. ఏడాది కాలంగా ఇక్కడ చోటు చేసుకుంటున్న సంఘటనలు, పలు ఆధారాలను జిల్లా అధ్యక్షులకు అందించినట్టు తెలిసింది. వచ్చే ఎన్నికల్లో గెలుపొందాలంటే ఎమ్మెల్యే హరిప్రియ విషయంపై మరింత కసరత్తు అవసరమని ఈ సమావేశంలో కొందరు నాయకులు చెప్పినట్టు ప్రచారం జరుగుతోంది. అధికార పార్టీలో ఈ స్థాయిలో ప్రచారం జరిగినా మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వర్లు తప్ప మిగిలిన వారెవరూ ఖండించలేదు. దీంతో ఎక్కువ మంది బీఆర్ఎస్ నేతలు అసంతృప్తితో ఉన్నట్లు కనిపిస్తోంది.

ప్రత్యామ్నాయమే మేలు..

ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియకు ప్రత్యామ్నాయంగా మరో మహిళా నేత అయితే బాగుంటుందని, మహబూబాబాద్ ఎంపీ మాలోతు కవితకు ఇక్కడ అవకాశం ఇవ్వాలని కొందరు నేతలు అభిప్రాయం వ్యక్తం చేసినట్లు తెలిసింది. గతంలో మహబూబాబాద్ నుంచి కవిత ఎమ్మెల్యేగా గెలిచారు. ఆమె భర్త స్వస్థలం ఇల్లెందు నియోజకవర్గంలోని గార్ల కావడంతో ఇల్లెందుతో కవితకు అనుబంధం ఉంది. ఇల్లెందు అసెంబ్లీ నియోజకవర్గంలోని గార్ల, బయ్యారం మండలాలు మహబూబాబాద్ జిల్లా పరిధిలో ఉన్నాయి. ఈ మండలాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు వివిధ అవసరాల నిమిత్తం ఎక్కువగా మహబూబాబాద్ నేతలతోనే టచ్‌లో ఉంటున్నారు. వీరి సాయంతో కవితను ఇల్లెందు నుంచి అసెంబ్లీకి పోటీ చేయించేలా పావులు కదుపుతున్నట్లు సమాచారం.



అసెంబ్లీ వైపు కవిత చూపు..

ప్రస్తుతం మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యురాలిగా ఉన్న మాలోతు కవిత రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో అసెంబ్లీకి పోటీ చేయాలని గట్టిగా కోరుకుంటున్నారు. డోర్నకల్, మహబూబాబాద్ అసెంబ్లీ స్థానాల నుంచి పోటీ చేయవచ్చని ఆమె అనుచరులు అంటున్నారు. అందువల్లే తన పార్లమెంట్ నియోజకవర్గంలో ఉన్న ఏడు స్థానాల్లో ఈ రెండింటిపై ఆమె ఎక్కువ దృష్టి పెట్టారనే ప్రచారం ఉంది. ఎంపీ కవిత తాజాగా ఇల్లెందు అసెంబ్లీ సెగ్మెంట్ పైనా ఆసక్తి చూపుతున్నట్లు ఆమె అనుచరుల ద్వారా తెలుస్తోంది. పార్టీ అసంతృప్త శ్రేణులు సైతం ఇల్లెందుకు రావాలంటూ ఆమెకు ఆహ్వానాలు పంపుతున్నారు.

రీకౌంటింగ్‌కు దరఖాస్తుల స్వీకరణ షురూ

- జూన్ 14 నుంచి పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ
- గణితంలోనే ఎక్కువ మంది ఫెయిల్

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలో పదో తరగతి పరీక్షల రీవాల్యుయేషన్, రీకౌంటింగ్ ప్రక్రియకు దరఖాస్తుల స్వీకరణ గురువారం ప్రారంభమైంది. రీవెరిఫికేషన్ దరఖాస్తులను డీఈఓ కార్యాలయంలో ఇచ్చే అవకాశం కల్పించారు. ఒక సబ్జెక్టుకు రూ.1000 చలానా చెల్లించి, దరఖాస్తులను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని, పూర్తి చేసిన అప్లికేషన్లు డీఈఓ కార్యాలయంలో సమర్పించాలి. రీ కౌంటింగ్ దరఖాస్తులను నేరుగా హైదరాబాద్‌లోని బోర్డు కార్యాలయానికి పోస్ట్ ద్వారా పంపించవచ్చు. ఇందుకోసం ఒక్కో సబ్జెక్టుకు రూ.500 చలానా, దరఖాస్తు, హాల్‌టికెట్ జిరాక్స్, సెల్ఫ్ అడ్రస్ వివరాలు జత చేయాల్సి ఉంటుందని విద్యాశాఖాధికారులు సూచించారు.

సప్లిమెంటరీ ఫీజు గడువు 26

పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 14 నుంచి 22 వరకు జరుగుతాయని విద్యాధికారులు వివరించారు. పరీక్ష ఫీజు 3 పేపర్లకు రూ.110, ఆపైన రూ.125 చొప్పున ఈనెల 26 వరకు చెల్లించాలని తెలిపారు. కాగా, జిల్లాలో పదో తరగతి విద్యార్థులు ఎక్కువ మంది గణితం, సైన్స్ సబ్జెక్టుల్లో ఫెయిలయ్యారు. ఈ ఏడాది గణితం పేపర్ చాలా హార్డ్‌గా ఉందని, ప్రశ్నపత్రంలో 18 శాతం మాత్రమే విద్యార్థులు రాయగలిగేలా ఉందని ఉపాధ్యాయులు అంటున్నారు.

15 నుంచి 'సాక్షి' వేసవి శిబిరం

చెస్‌లో మెళకువలపై ఐదు రోజులు ఉచిత శిక్షణ

భద్రాచలం టౌన్: భద్రాచలానికి చెందిన క్రాంతి చెస్ అకాడమీ, సాక్షి దినపత్రిక సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 15 నుంచి 18వ తేదీ వరకు భద్రాచలంలో ఉచిత శిక్షణ శిబిరం ఏర్పాటు చేయనున్నారు. 3 నుంచి 18 సంవత్సరాల వయసు గలవారు హాజరై చెస్‌లో మెళకువలను తెలుసుకోవాలని నిర్వాహకులు సూచించారు. చెస్ ప్రాముఖ్యత, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించడం వంటి అంశాలపై శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు 97053 57433 నంబర్‌కు ఫోన్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు.

చివరి గింజ వరకూ కొంటాం..

మొక్కజొన్న కొనుగోళ్లను ప్రారంభించిన మంత్రి పువ్వాడ

చింతకాని: రైతులు పండించిన చివరి మొక్కజొన్న గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వెల్లడించారు. చింతకాని సొసైటీలో ఏర్పాటుచేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఆయన గురువారం ప్రారంభించి మాట్లాడారు. అకాల వర్షాలతో నష్టపోయిన రైతుల నుంచి పంటను గిట్టుబాటు ధరతో కొనుగోలు చేయాలనే లక్ష్యంతో ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులను ఆదుకునేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, సీఎం కేసీఆర్ నేతృత్వాన అకాల వర్షాల వలన తడిచిన ధాన్యాన్ని సైతం మద్దతు కొనుగోలు చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ నామా నాగేశ్వరావు, కలెక్టర్ వీ.పీ.గౌతమ్, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరావు, జెడ్పీ, డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్లు లింగాల కమల్‌రాజ్, కూరాకుల నాగభూషణం, శేషగిరిరావు, రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ నల్లమల వెంకటేశ్వరావు, డీసీఓ విజయకుమారి, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ సునీత తదితరులు పాల్గొన్నారు.



మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పువ్వాడ, ఎంపీ నామా

మావోయిస్టుల స్వార్థం కోసం ఆదివాసీల బలి

కొత్తగూడెంటౌన్: మావోయిస్టు పార్టీ అగ్ర నాయకులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం కిందిస్థాయి నాయకులు, సభ్యులను బలి పశువులను చేస్తున్నారని ఎస్పీ వినీత్ గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. తాము విలాసవంతమైన జీవనం సాగించేందుకు కింది స్థాయి నాయకులు, దళ సభ్యులతో చట్ట వ్యతిరేక పనులు చేయిస్తున్నారని పేర్కొన్నారు. సరిహద్దు ఏజెన్సీ గ్రామాలకు చెందిన అమాయక ఆదివాసీ యువతను బలవంతంగా పార్టీలో చేర్చుకుని, తుపాకులు, పేలుడు పదార్థాలు ఇచ్చి పోలీసులపై దాడులు చేసేందుకు పంపుతున్నారని, ఈ క్రమంలో వారి ప్రాణాలు కూడా పోతున్నాయని తెలిపారు. అమాయక రైతులను చంపడం, ఆదివాసీలు సంచరించే ప్రదేశాల్లో బాంబులు పెట్టి మూగజీవాలను బలి తీసుకోవడం, కాంట్రాక్టర్లను బెదిరించడం, ఇన్‌ఫార్మర్ల నెపంతో ఆదివాసీలను హత్య చేయడం, విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై దాడులకు పాల్పడం వంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేస్తున్నారని విమర్శించారు. ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ జిల్లాలో డీఆర్‌జీ బలగాలపై ఇటీవల దాడికి పాల్పడి అమాయకులైన 13 మంది ఆదివాసీల ప్రాణాలను బలిగొన్నారని ఆరోపించారు. దామోదర్, ఆజాద్, అరుణ తదితర అగ్రనాయకులు అక్రమంగా సంపాదించిన డబ్బును తమ బంధువులకు పంపుతున్నారని పేర్కొన్నారు.



ఎస్పీ వినీత్

అటవీ అభివృద్ధి, సంరక్షణ భేష్



జ్ఞాపిక అందజేస్తున్న అధికారులు, పక్కన కలెక్టర్ అనుదీప్, ఎస్పీ వినీత్, పీఓ గౌతమ్ తదితరులు

కిన్నెరసానిని సందర్శించిన పీసీసీఎఫ్ డోబ్రియల్

పాల్వంచరూరల్ : జిల్లాలో అటవీ సంరక్షణ, ప్లాంటేషన్ అభివృద్ధి పనులు బాగున్నాయని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (పీసీసీఎఫ్) ఆర్.ఎం. డోబ్రియల్ అన్నారు. మండల పరిధిలోని కిన్నెరసాని పర్యాటక ప్రాంతాన్ని కలెక్టర్ అనుదీప్, ఎస్పీ వినీత్, ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు, సీసీఎఫ్ భీమా నాయక్‌తో కలిసి గురువారం డోబ్రియల్ దంపతులు సందర్శించారు. డీర్‌పార్కులోని దుప్పులను వీక్షించి జలాశయంలో బోటింగ్ చేశారు. ఎన్విరాన్‌మెంట్ భవనంలో జిల్లా అటవీ ఫిల్మ్ డాక్యుమెంటరీ డిస్‌ప్లేను ఆయన ప్రారంభించారు. అనంతరం డివిజన్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించి అడవుల అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలను వివరించారు. కాగా, జిల్లా అధికారులు పీసీసీఎఫ్ దంపతులను ఘనంగా సత్కరించి కిన్నెరసాని ఐలాండ్ మెమెంటోను బహూకరించారు. కార్యక్రమంలో డీఎఫ్ఓ రంజిత్ లక్ష్మణ్ నాయక్, ఎఫ్‌డీఓలు కట్టా దామోదర్‌రెడ్డి, తిర్మల్‌రావు, రేంజర్లు శ్రీనివాసరావు, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

వ్యర్థాల సేకరణ నిరంతరం సాగాలి

'పల్లె ప్రగతి' సమీక్షలో కలెక్టర్ అనుదీప్

సూపర్‌బజార్(కొత్తగూడెం): గ్రామాలు, పట్టణాల్లో ఇళ్ల నుంచి తడి, పొడి వ్యర్థాల సేకరణ ప్రక్రియ నిరంతరం కొనసాగాలని కలెక్టర్ అనుదీప్ అన్నారు. ఐడీఓసీ సమావేశ హాల్‌లో గురువారం ఆయన పంచాయతీరాజ్ అధికారులతో పల్లె ప్రగతి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి పంచాయితీలో వర్మి, తడి వ్యర్థాల ద్వారా సమకూరిన ఆదాయ, వ్యయ వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. వైకుంఠధామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని, 4 వేల జనాభా దాటిన గ్రామాల్లో మృతదేహాలను భద్రపరిచే ఫ్రీజర్లు, 10 వేల జనాభా దాటిన గ్రామాల్లో వైకుంఠరథం ఏర్పాటు చేయాలని సూచించారు. స్వచ్ఛ సర్వేక్షణ్, స్వచ్ఛ భారత్ గ్రామీణ్ పనులు పెండింగ్‌లో పెట్టవద్దన్నారు. గ్రామాల్లో మౌలిక సౌకర్యాల కల్పనపై టీమ్‌లు పర్యటించి నివేదికలు అందజేయాలని అన్నారు. జిల్లాలో ఎంపిక చేసిన 102 గ్రామాల్లో మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు తదితర మౌలిక సౌకర్యాల కల్పనపై సోమవారం నాటికి నివేదికలు అందించాలని ఆదేశించారు. వైట్ హౌస్ పంచాయతీలుగా ఎంపికైన మొండికుంట, రామచంద్రాపురం, మోరంపల్లి బంజర, ఇరవెండిలో వ్యక్తిగత మరుగుదొడ్లు, ఇంకుడుగుంతలు, కమ్యూనిటీ ఇంకుడు గుంతలపై విచారణ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు, జెడ్పీ సీఈఓ విద్యాలత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్

15 నుంచి సీఎం కప్ పోటీలు

కొత్తగూడెంటౌన్: ఈ నెల 15 నుంచి 17 వరకు మండల, 22 నుంచి 24వ తేదీ వరకు జిల్లా స్థాయిలో సీఎం కప్ పోటీల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ అనుదీప్ తెలిపారు. గురువారం ఆయన జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 15 నుంచి 36 ఏళ్ల మధ్య గల యువతీ, యువకులు పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. మండలస్థాయిలో అథ్లెటిక్స్, కబడ్డీ, ఫుట్‌బాల్, ఖోఖో, వాలీబాల్, జిల్లా స్థాయిలో బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, హ్యాండ్‌బాల్, స్విమ్మింగ్, రెజ్లింగ్ పోటీలు ఉంటాయని వివరించారు. మండల స్థాయిలో ఎంపీపీ చైర్మన్‌గా, జెడ్పీటీసీ, ఎంపీడీఓ, తహసీల్దార్, ఎంఈఓ, గెజిటెడ్ హెచ్‌ఎంలు, జిల్లా స్థాయిలో చైర్మన్‌గా కలెక్టర్, వైస్ చైర్మన్‌గా ఎస్పీ, కో–వైస్ చైర్మన్‌గా అదనపు కలెక్టర్, కన్వీనర్‌గా డీవైఎస్ఓ ఉంటారని వివరించారు.

రెండో రోజూ ప్రశాంతం

సుజాతనగర్: స్థానిక అబ్దుల్ కలాం, పాల్వంచ అనుబోస్ ఇంజనీరింగ్ కాలేజీల్లో గురువారం రెండోరోజు నిర్వహించిన ఎంసెట్ ప్రశాంతంగా ముగిసింది. అబ్దుల్ కలాం కళాశాలలో 125 మంది విద్యార్థులకు గాను 120 మంది, అనుబోస్ కళాశాలలో 100 మందికి గాను 96 మంది హాజరయ్యారని నిర్వాహకులు తెలిపారు.



విద్యార్థుల హాల్‌టికెట్లు పరిశీలిస్తున్న సిబ్బంది

పరీక్షలకే పరిమితం..

- కంటివెలుగులో శస్త్ర చికిత్సలెప్పుడో ?
- ఆపరేషన్‌కు జిల్లాలో 11,647 మంది గుర్తింపు
- ప్రభుత్వ మార్గదర్శకాల కోసం నిరీక్షణ



ఈమె 4 ఇంక్‌లైన్ పంచాయతీ శాంతినగర్‌కు చెందిన రామంచి కనకమ్మ. వయసు 70 ఏళ్లు. గ్రామంలో ఏర్పాటుచేసిన కంటి వెలుగు శిబిరంలో 25 రోజుల క్రితం పరీక్ష చేయించుకుంది. కంటి శుక్లాలు తొలగించే శస్త్ర చికిత్స అవసరమని వైద్య సిబ్బంది చెప్పారు. ఆమెకు గుర్తించిన దృష్టిలోపం, ఆధార్‌కార్డు వివరాలు నమోదుకున్నారు. కానీ నేటికీ ఆపరేషన్ చేయలేదు. తనకు శస్త్రచికిత్స ఎప్పుడు చేస్తారోనని కనకమ్మ ఎదురుచూస్తోంది.



కంటివెలుగు శిబిరంలో పరీక్షలు చేస్తున్న సిబ్బంది (ఫైల్)

చుంచుపల్లి: జిల్లాలో రెండో విడత కంటివెలుగు కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల పరిధిలో జిల్లా వైద్యాధికారులు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తూ 18ఏళ్లు పైబడిన వారందరికీ పరీక్షలు చేస్తున్నారు. ఈ శిబిరాలు ప్రజలకు ప్రయోజనకరంగానే ఉన్నా.. కంటికి శస్త్ర చికిత్స అవసరమైన వారికి మాత్రం ఎదురుచూపులు తప్పడం లేదు. దీనిపై ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి మార్గదర్శకాలు విడుదల చేయలేదు. కంటి వెలుగు శిబిరాల్లో వైద్యాధికారులు పరీక్షించి అవసరమైన వారికి రీడింగ్, ప్రిస్కిప్షన్ కళ్లద్దాలు మాత్రమే పంపిణీ చేస్తున్నారు. ఎక్కువ దృష్టిలోపం కలిగి శస్త్ర చికిత్స చేయాల్సిన వారిని గుర్తించి పేర్లు నమోదు చేసుకుంటున్నారు. అయితే వీరికి ఎప్పుడు ఆపరేషన్ చేస్తారనేది అధికారుల్లో సైతం స్పష్టతలేదు. 2018లో మొదటి విడత కంటివెలుగు కార్యక్రమంలో కూడా కొద్ది మందికి మాత్రమే శస్త్ర చికిత్స చేసి ఆ తర్వాత మానేశారు. ఇప్పుడు కూడా అదే పరిస్థితి ఉంటుందేమోనని బాధితులు ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలో 11,647 మంది గుర్తింపు..

జిల్లాలో 481 గ్రామపంచాయతీలు, 4 మున్సిపాలిటీల పరిధిలో 10 లక్షలకు పైగా జనాభా ఉన్నారు. రెండో విడత కంటి వెలుగులో భాగంగా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు 7,90,398 మందికి కంటి పరీక్షలు చేయాలని నిర్ణయించారు. ఇందు కోసం 48 వైద్య బృందాలను ఏర్పాటు చేశారు. జనవరి 19 నుంచి ప్రారంభమైన ఈ శిబిరాల్లో ఇప్పటివరకు 383 గ్రామ పంచాయతీల పరిధిలో 4,11,270 మందికి కంటి పరీక్షలు చేశారు. ఇందులో 85,773 మందికి దగ్గరి చూపు సమస్య ఉందని గుర్తించి రీడింగ్ కళ్లద్దాలు పంపిణీ చేశారు. మరో 51,487 మందికి దూరపు చూపు సమస్య ఉండగా అందులో 37,428 మందికి ప్రిస్కిప్షన్ అద్దాలను ఇచ్చారు. ఇంకా 14,059 మందికి ప్రిస్కిప్షన్ అద్దాలు ఇవ్వాల్సి ఉంది. రెండో విడతలో ఇప్పటి వరకు 11,647 మందికి కంటి శస్త్ర చికిత్సలు అవసరమని అధికారులు గుర్తించారు. కంటి వెలుగు కార్యక్రమం ఇంకా కొనసాగుతుండడంతో శస్త్రచికిత్స చేసే వారి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. 2018లో తొలి విడత కంటి వెలుగు కార్యక్రమం సందర్భంగా 4,91,344 మందికి నేత్రపరీక్షలు నిర్వహించారు. ఇందులో 1,70,898 మందికి కళ్లద్దాలు పంపిణీచేశారు. ఇక కంటి శస్త్రచికిత్సలు అవసరమని 34,850 మందిని గుర్తించగా అందులో 684 మందికి మాత్రమే ఆపరేషన్లు చేశారు. మిగతా వారిని అలాగే వదిలేశారు. సమస్య తీవ్రత దృష్ట్యా కొందరు ప్రైవేట్ ఆస్పత్రుల్లో శస్త్ర చికిత్స చేయించుకున్నారు. రెండో విడతలో అయినా దృష్టిలోపం గల బాధితులకు శస్త్ర చికిత్సలు చేసేలా మార్గదర్శకాలు విడుదల చేయాలని పలువురు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావాలి



రెండో విడత కంటి వెలుగులో పరీక్షలు చేసి కళ్లద్దాలు పంపిణీ చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలున్నాయి. అయినా శస్త్ర చికిత్సలు చేయాల్సిన వారిని గుర్తిస్తున్నాం. దృష్టి లోపం ఉన్న వాళ్లకు ఆపరేషన్ల నిర్వహణకు సంబంధించి ఇంతవరకు మాకెలాంటి మార్గదర్శకాలు రాలేదు.

– వర్షియానాయక్, కంటి వెలుగు ప్రోగ్రాం అధికారి

క్లుప్తంగా

సింగరేణి ఆస్పత్రిలో తనిఖీ



వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న అడిషనల్ సీఎంఓ సుజాత

మణుగూరు రూరల్ : సింగరేణి మణుగూరు ఏరియా ఆస్పత్రిని అడిషనల్ సీఎంఓ సుజాత గురువారం సందర్శించి తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని క్యాజువాలిటీ, వార్డులు, స్టోర్స్, సెంట్రల్ ఫార్మసీ, క్యాంటీన్, మెడికల్ ఓపీ, ఆపరేషన్ థియేటర్‌తో పాటు పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది ఆస్పత్రిలో అన్ని సమయాల్లో అందుబాటులో ఉంటూ నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని సూచించారు. ఆస్పత్రి ఆవరణలో పచ్చదనం, పరిశుభ్రతను పాటించాలని చెప్పారు. అనంతరం ఏరియా జీఎం దుర్గం రామచందర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో అధికారులు రమేష్, మేరికుమారి, డాక్టర్ శేషగిరి, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రిలో షార్ట్ సర్క్యూట్



పొగను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో గురువారం షార్ట్ సర్క్యూట్ ఏర్పడింది. ఆస్పత్రి ఆవరణ మొత్తం దట్టమైన పొగతో నిండిపోయింది. దీంతో రోగులు ఆందోళన చెందారు. సిబ్బంది సమాచారంతో వచ్చిన అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాస్ తదితరులు పొగను అదుపు చేసేందుకు తగిన చర్యలు తీసుకున్నారు.

ఉల్వనూరులో చోరీ

పాల్వంచరూరల్: తాళంవేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగిన సంఘటనపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని ఉల్వనూరు గ్రామానికి చెందిన బెల్లంకొండ సుధాకర్, సావిత్రి దంపతులు గత నెల 30న ఇంటికి తాళం వేసి కంబాలపల్లి వెళ్లారు. తిరిగి గురువారం వచ్చి చూసేసరికి ఇంటి తలుపు, తాళం పగలగొట్టి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న రూ.80 వేల విలువైన బంగారం, 20 తులాల వెండి వస్తువులు చోరీకి గురైనట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మెడికల్ షాపు సీజ్

జూలూరుపాడు: మండలంలోని పడమటనర్సాపురంలో ఓ మెడికల్ షాపును గురువారం కొత్తగూడెం డ్రగ్ ఇన్‌స్పెక్టర్(డీఐ) సంపత్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మందులు, రికార్డులు, బిల్లులను పరిశీలించారు. బిల్లులు సక్రమంగా లేకపోవడం, కాలం చెల్లిన మందులు ఉండటంతో లైసెన్స్ రద్దు చేయడంతో మెడికల్ షాపును సీజ్ చేసినట్లు డీఐ తెలిపారు.

వాగులో పడి వృద్ధుడి మృతి



సాంబయ్య మృతదేహం

టేకులపల్లి: వాగులో పడి వృద్ధుడు మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. బోడు ఎస్‌ఐ రంజిత్ కుమార్ కథనం ప్రకారం.. ఏన్కూరు మండలం బురదరాఘవాపురం గ్రామానికి చెందిన వేముల సాంబయ్య(70) ఐదు నెలల నుంచి ఇల్లెందు మండలం మర్రిగూడెంలో కార్పెంటర్‌గా పని చేస్తున్నాడు. గురువారం సమీపంలోని టేకులపల్లి మండలం కొత్తూరు గ్రామంలో ఉన్న తన సోదరి అనబత్తుల ఈశ్వరమ్మ వద్దకు వచ్చాడు. అనంతరం వాగులో బట్టలు ఉతుక్కుని, స్నానం చేసేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు వాగులో పడి మృతి చెందాడు. సాయంత్రం స్నానానికి వెళ్లిన యువకులు గమనించి బోడు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. వాగు ఒడ్డున ఉన్న బట్టలు, ఆధార్ కార్డు ఆధారంగా మృతుడి సాంబయ్యగా గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమారుడు ఉపేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చెరువులో మునిగి వృద్ధుడు..

బోనకల్: మండలంలోని రావినూతలలో ప్రమాదవశాత్తు చెరువులో పడిన మంద నారాయణ(70) మృతి చెందాడు. గేదెలు మేపేందుకు పొలానికి వెళ్లిన ఆయన తిరిగి వస్తుండగా గేదెలు చెరువులోకి దిగాయి. దీంతో వాటిని తోలేందుకు చెరువులోకి దిగిన ఆయన గుంటలో మునిగి చనిపోయాడు. మృతుడికి భార్య, ఓ కుమారుడు, ఓ కుమార్తె ఉన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.14,205

చెట్లు, స్తంభాలు కూలిపోయాయి..

- పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం
- చెట్లు విరిగి పడి రోడ్లపై నిలిచిపోయిన వాహనాలు
- గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం
- మామిడి కాయలు రాలి రైతుకు నష్టం

దమ్మపేట/అశ్వారావుపేటరూరల్/దుమ్ముగూడెం/చర్ల: జిల్లాలో గురువారం సాయంత్రం ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. అక్కడక్కడా వడగళ్లు పడ్డాయి. భారీ గాలులకు చెట్లు విరిగి పడ్డాయి. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు కూడా కూలిపోయాయి. చెట్ల కొమ్మలు విరిగి పడి పలుచోట్ల వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. మరికొన్నిచోట్ల ఇంటి పైకప్పు రేకులు ఎగిరిపోయాయి. దమ్మపేట మండలం మందలపల్లి–ముష్టిబండ మార్గంలో రాష్ట్రీయ రహదారిపై అడ్డంగా పెద్ద చెట్టు, విద్యుత్ స్తంభం విరిగి పడ్డాయి. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడి వాహనాలు బారులు తీరాయి. దీనితో వాహనాలను దారి మళ్లించారు. ముష్టిబండ గ్రామం నుంచి సాయన్నరావుపాలెం మీదుగా బస్సులు, ఇతర వాహనాలను దమ్మపేటకు వచ్చాయి. దమ్మపేటలో పిడుగుపడి కొబ్బరి చెట్టుకు మంటలు అంటుకున్నాయి.

చర్లలో..

చర్ల మండలంలోని సీ కత్తిగూడెం, పాతచర్ల, విజయకాలనీ, గొంపల్లి, మొగళ్లపల్లి చినమిడిసిలేరు తదితర ప్రాంతాలలో చెట్లు విరిగి రహదార్లకు అడ్డంగా పడ్డాయి. పాతచర్ల, విజయకాలనీ సమీపంలో చెట్లు విరిగి తీగలపై పడటంతో విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. దీంతో ఆయా గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గొంపల్లి, మొగళ్లపల్లి గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కూడా పడిపోయాయి. గ్రామాల్లో రైతులు కల్లాల్లో ఆరబోసిన ధాన్యం, మిర్చిపై కప్పిన టార్పలిన్ పట్టాలు గాలిదుమారానికి కొట్టుకుపోయాయి. రాళ్లగూడెం, కుదునూరు, కలివేరు తదితర గ్రామాల్లో ఇళ్ల పైకప్పులు సైతం ఎగిరిపోయాయి.



దమ్మపేట: నేలరాలిన మామిడి కాయలు

దుమ్ముగూడెంలో..

దుమ్ముగూడెం మండలంలోని సీతానగరం–బండిరేవు గ్రామాల మధ్య చర్ల–భద్రాచలం ప్రధాన రహదారిపై చింత చెట్టు నేలకొరిగింది. దీంతో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. గ్రామస్తులు చెట్టును తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు.



అశ్వారావుపేటరూరల్: నారంవారిగూడెం వద్ద విరిగిపడిన విద్యుత్ స్తంభాలు

అశ్వారావుపేటలో..

అశ్వారావుపేట మండలంలోని ఆసుపాక–కుడుములపాడు మార్గంలో, అశ్వారావుపేట–మందలపల్లి ప్రధాన రహదారిలో రోడ్ల వెంట ఉన్న భారీ వృక్షాలు విరిగి అడ్డంగా పడిపోయాయి. రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నారంవారిగూడెం కాలనీ వద్ద నాలుగు విద్యుత్ స్తంభాలు, వైర్లు తెగిపడ్డాయి. వినాయకపురం, వినాయకపురం కాలనీ, ఆసుపాక, నందిపాడు, కుడుములపాడుతోపాటు పలు గిరిజన గ్రామాల్లో వడగళ్ల వాన కురిసింది. మామిడి కాయలు రాలిపోయాయి. వడగాళ్లతో చెట్లకు ఉన్న మామిడి కాయలు దెబ్బతింటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎస్సై బి.రాజేశ్ కుమార్ స్థానికుల సహకారంతో రోడ్లపై అడ్డంగా పడిన చెట్లను తొలగించారు.



దుమ్ముగూడెం: రహదారిపై కూలిన చింతచెట్టు



చర్ల: పాతచర్లలో రహదారిపై కూలిన విద్యుత్ స్తంభం



అశ్వారావుపేటరూరల్: ఆసుపాక–కుడుములపాడు మధ్యలో రహదారిపై పడ్డ చెట్టు



దమ్మపేట: పిడుగుపాటుతో కొబ్బరి చెట్టుకు అంటుకున్న మంటలు



చర్ల: గొంపల్లిలో కూలిపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



దమ్మపేట:మందలపల్లిశివారులో విద్యుత్ స్తంభం, చెట్లు విరిగిపడి భారీగా నిలిచిపోయిన ట్రాఫిక్

వాన పేరిట దోపిడీ..



ఖమ్మం మార్కెట్‌లో మిర్చి బస్తాలపై టార్పాలిన్లు కప్పుతున్న రైతులు

ఖమ్మం మార్కెట్‌లో మిర్చి వ్యాపారుల సిండికేట్

- ధర తగ్గించడంతో రైతులకు 'అకాల' నష్టం
- క్వింటాకు రూ.4వేల నుంచి రూ.5 వేల మేర కోత

ఖమ్మంవ్యవసాయం: అకాల వర్షంతో పంట తడిసిపోతోందని రైతులు ఆవేదన చెందుతుండగా.. ఇదే కారణం చెప్పి వ్యాపారులు ధర తగ్గించారు. గురువారం ఉదయం 6:30 గంటల సమయాన ఖమ్మంలో ఒక్కసారిగా వర్షం కురిసింది. దీంతో ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో అమ్మకానికి తీసుకొచ్చిన మిర్చి బస్తాలు కొంతమేర తడిశాయి. ఇదే అదునుగా మిర్చి తడిసి నాణ్యత తగ్గిందని, చివరి కోత కావడంతో పనికి రాదని సాకులు చెబుతూ దగాకు పాల్పడ్డారు. అయినప్పటికీ దూరప్రాంతాల నుంచి వచ్చిన రైతులు చేసేదేం లేక వ్యాపారులు చెప్పిన ధరకు అమ్ముకుని నిరాశగా వెనుదిరగాల్సి వచ్చింది.

సిండికేట్ మాయాజాలం

మార్కెట్ కమిటీ లెక్కల ప్రకారం 23,780 బస్తాల మిర్చి విక్రయానికి రాగా, రోజు మాదిరిగానే గురువారం ఉదయం నిర్వహించిన జెండా పాటలో మిర్చికి రూ.23,051 గరిష్ట ధర పలికింది. దీంతో రైతులు ఆనందపడ్డారు. కానీ వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి దగా చేశారు. అకాల వర్షానికి మిర్చి బస్తాలు తడవడంతో నాణ్యత దెబ్బతింటుందని, చివరి కోత పంట కావడంతో సరిగ్గా లేదని కుంటి సాకులు చెప్పి కొనుగోళ్లు సాగించారు. గరిష్ట ధర రూ.23 వేలకు పైగా పలకడంతో రూ.వెయ్యి తగ్గినా రూ.22వేల వరకు వస్తుందని రెండో కోత పంట రైతులు, రూ.20వేల ధర అయినా దక్కుతుందని మూడో కోత రైతులు ఆనందించగా, నిరాశే మిగిలింది. ఏకంగా క్వింటాకు రూ.4వేల నుంచి రూ.5 వేల వరకు తగ్గించడాన్ని రైతులు జీర్ణించుకోలేకపోయారు. గురువారం ఒక్కరోజే ఖమ్మం మార్కెట్‌లో వ్యాపారులు తగ్గించిన ధర విలువ రూ.4 కోట్ల నుంచి రూ.5 కోట్ల వరకు ఉంటుందని అంచనా.

నిండిపోయిన షెడ్లు..

ఈనెల 15వ తేదీ నుంచి ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు సెలవులు ప్రకటించడంతో అమ్మకానికి రైతులు మిర్చి భారీగా తీసుకొస్తున్నారు. బుధవారం రాత్రి నుంచి వచ్చిన మిర్చి బస్తాలతో యార్డులోని షెడ్లు నిండిపోగా.. గురువారం తెల్లవారుజామున వచ్చిన రైతులు షెడ్ల మధ్య, యార్డు ఖాళీ స్థలంలో బస్తాలు దింపుకున్నారు. ఇంతలోనే అరగంట పాటు వర్షం కురవగా రైతులు ఉరుకులు, పరుగులపై టార్పాలిన్లు తెచ్చి కప్పినా కొందరి బస్తాలు వానకు తడిశాయి.



వర్షం కురుస్తుండగా తడుస్తున్న మిర్చి బస్తాలు

రూ.16,500 ధర పెట్టారు



మార్కెట్‌కు సెలవులని తెలియడంతో 72 బస్తాల మిర్చి తీసుకొచ్చా. వర్షానికి తడవకుండా కాపాడడంతో రూ.20 వేల వరకు ధర పలుకుతుందని ఆశించాను. కానీ వర్షం పేరిట వ్యాపారులు రూ.16,500గా ధర చెప్పడంతో ఏం చేయాలో పాలుపోక అమ్ముకున్నా.

– వేసాల సూర్యనారాయణ, రేపల్లెవాడ, చింతకాని మండలం

తర్వాత అమ్ముకుందామని వెళ్తున్నా



47బస్తాల మిర్చి విక్రయానికి తీసుకొస్తే కొన్ని తడిశాయి. కిలో చొప్పున కోత పెడతామని చెబుతూ క్వింటాకు ధర రూ.20,500గా ధర నిర్ణయించారు. దీంతో తక్కువ ధరకు అమ్ముకోవడం ఇష్టం లేక శుక్రవారం విక్రయించడానికి నిర్ణయించుకుని వెళ్లిపోతున్నాను.

– వరికొల్లు వసంతరావు, ముచ్చర్ల, కామేపల్లి మండలం

విద్యుదాఘాతంతో రైతు మృతి



రవి మృతదేహం

చంద్రుగొండ : మండలంలోని రావికంపాడు పంచాయతీ దుబ్బతండాలో గురువారం పంటచేలో ఓ యువరైతు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. గ్రామస్తుల కథనం ప్రకారం... దుబ్బతండాకు చెందిన రైతు తేజావత్ రవి (33) తన పంటచేలో పాడిపశువులకు మేతకోసం జున్ను గడ్డి సాగు చేశాడు. గడ్డికి నీళ్లు పెట్టేందుకు బోరు మోటారు ఆన్‌చేసేందుకు వెళ్లాడు. స్టార్టర్‌కు అనుసంధానంగా ఉన్న వైరు తగలడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. గమనించిన ఇరుగు పొరుగు రైతులు చంద్రుగొండ ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య సంధ్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి...

దుమ్ముగూడెం: మండలంలోని ఆంధ్రకేసరి నగర్ గ్రామశివారులో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. గంగోలు గ్రామానికి చెందిన కునిని విమలాకర్(42) తాపీ మేస్త్రీగా పని చేస్తూ జీవినం సాగిస్తున్నాడు. బుధవారం రాత్రి తన కుమారుడితో కలిసి ద్విచక్రవాహనంపై పెట్రోల్ కొట్టించుకునేందుకు బంక్ దగ్గరకు వెళ్తున్నారు. కుమారుడు బైక్ నడుపుతుండగా, విమలాకర్ వెనుక కూర్చొన్నాడు. ఈ క్రమంలో ఆంధ్రకేసరి నగర్ గ్రామ శివారులో స్పీడ్ బ్రేకర్ వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న కిలోమీటర్ రాయిని ఢీకొట్టింది. దీంతో విమలాకర్ కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. తీవ్ర రక్తస్రావమైంది. భద్రాచలం తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రవికుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జేపీఎస్‌లకు అండగా నిలుస్తాం

మాజీ ఎంపీ రవీంద్ర నాయక్



జేపీఎస్‌లకు సంఘీభావంగా దీక్షలో కూర్చున్న మాజీ ఎంపీ రవీంద్ర నాయక్

చుంచుపల్లి: తమ ఉద్యోగాలు క్రమబద్ధీకరించాలని కోరుతూ సమ్మె చేస్తున్న జేపీఎస్‌లకు అండగా నిలుస్తామని మాజీ ఎంపీ, బీజేపీ రాష్ట్ర నాయకుడు రవీంద్రనాయక్ పేర్కొన్నారు. గురువారం ఆయన సమ్మె శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులను ప్రభుత్వం విస్మరించడం సరికాదన్నారు. అనంతరం బీజేపీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని ఆరోపించారు. మాటల గారడీలతో కేసీఆర్ మాయ పాలన చేస్తున్నాడని విమర్శించారు. నరేంద్ర మోదీ అందిస్తున్న ప్రజా సంక్షేమ ఫలాలు పేదలకు అండగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. బీజేపీ నాయకులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఆకుల నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, సీతారాంనాయక్, లక్ష్మణ్ అగర్వాల్, నరేంద్ర బాబు, రవినాయక్, హతీరాం పాల్గొన్నారు.

అప్రమత్తతే మేలు



ఘాట్ వద్ద గోదావరి నదిలో స్నానం చేస్తున్న భక్తులు(ఫైల్)

చెరువులు, బావుల్లో ఈతకు వెళ్లి పలువురి మృత్యువాత

- గోదావరిలో లోతు అంచనా తెలియక నీట మునక
- ప్రమాద నివారణకు శాశ్వత చర్యలు చేపట్టని అధికారులు
- వేసవి సెలవుల్లో తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉంటే మేలు

భద్రాచలంఅర్బన్: వేసవి సెలవులు కావడంతో పిల్లలు స్నేహితులతో కలిసి సరదాగా, ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు ఈతకు వెళ్తుంటారు. బావులు, కుంటలు, వాగులు, చెరువుల్లో జలకాలాడుతూ ఆనందిస్తుంటారు. ఈత రాకపోవడం, లోతు అంచనా వేయకపోవడంతో వంటి కారణాలతో నీటి మునిగి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఇక భద్రాచలం వద్ద పలువురు యువకులు, భక్తులు గోదావరి నదిలో స్నానం చేస్తుంటారు. నీటి లోతు అంచనా వేయలేక మునిగి మృత్యువాత పడుతున్నారు. గడిచిన నాలుగు నెలల్లో పలువురు నీటిమునిగి ప్రాణాలు కోల్పోయారు. గత బుధవారం కూడా ముగ్గురు యువకులు ఈతకొడుతూ నీటిలో మునిగిపోతుండగా, ఆ సమయంలో అక్కడ ఉన్న ఫొటోగ్రాఫర్లు రక్షించారు.

కొన్ని ఘటనలను పరిశీలిస్తే..

- ఈ ఏడాది ఫిబ్రవరి 20న పట్టణానికి చెందిన ఆరుగురు యువకులు ఎటపాక (ఏపీ సరిహద్దు) ఉన్న మేడువాయి వద్ద గోదావరిలో స్నానానికి వెళ్లారు. వీరిలో ఇద్దరు అక్బర్ బాషా (17), పాలపర్తి వాసు(16) నీటిలో గల్లంతై మృతి చెందారు.
- ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలంలోని గడ్డికుంట గ్రామానికి చెందిన గుగూలోత్ మనోహర్ (17) కుటుంబ సభ్యులతో కలిసి మే 7న శ్రీసీతా రామచంద్ర స్వామివారి దర్శనానికి వచ్చాడు. గోదావరిలో స్నానం చేస్తుండగా నీటిలో మునిగి మృత్యువాత పడ్డాడు.

రక్షణ చర్యలు శూన్యం

భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామివారిని దర్శించుకునేందుకు ఇరు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. పవిత్ర గోదావరి నదిలో స్నానంచేస్తూ లోతు అంచనా ఉండక నీట మునిగి పలువురు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు హడావుడి చేస్తున్న అధికారులు శాశ్వతంగా నివారణ చర్యలు తీసుకోవడంలేదు. దేవస్థానం, ఇరిగేషన్, గ్రా మ పంచాయతీ అధికారుల సమన్వయం లోపించి రక్షణ చర్యలు చేపట్టడంలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ మూడు శాఖలతో పాటు అగ్నిమాపకశాఖ, జాతీయ విపత్తు నివారణ శాఖ అధికారులు సమన్వయం చేసుకుని పక్కాగా చర్యలు తీసుకోవాలని, భక్తుల ప్రాణాలు పోకుండా చూడాలని పలువురు కోరుతున్నారు. గోదావరిలో లోతు ఎక్కువగా ఉన్న ప్రదేశాల వివరాలు తెలిసేలా నదీ తీరంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని పేర్కొంటున్నారు. పిల్లలు, యువకులు గోదావరితోపాటు బావులు, కుంటలు, చెరువుల్లో ఈతకు వెళ్లకుండా తల్లిదండ్రులు కూడా జాగ్రత్తలు తీసుకోవాలి.

సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తాం



గోదావరి నదిలో స్నానం చేసేందుకు వెళ్తున్న భక్తులు లోతు అంచనా వేయలేక ప్రమాదాలకు గురవుతున్నారు. ఇందుకు గోదావరి వద్ద సూచిక బోర్డులను ఏర్పాటు చేస్తాం. మిగితా శాఖలతో కూడా సమన్వయం చేసుకుంటాం. ఈతకు వెళ్లేట ప్పుడు యువకులు జాగ్రత్తలు తీసుకోవాలి. అజాగ్రత్తగా ఉంటూ ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు.

– రాంప్రసాద్, ఇరిగేషన్ ఈఈ, భద్రాచలం

క్లుప్తంగా...

జన సైనికులు, ఫ్యాన్స్‌కు పవన్ వెన్నుపోటు

రామ్ గోపాల్ వర్మ ట్వీట్



సాక్షి, అమరావతి: సొంత ఫ్యాన్స్‌నే కాకుండా, తన కాపుల్ని, తనని తానే జనసేన అధ్యక్షుడు, సినీ నటుడు పవన్ కళ్యాణ్ వెన్నుపోటు పొడిచేసుకున్నారని ప్రముఖ సినీ దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ ట్విటర్‌లో వ్యాఖ్యానించారు. ఆ రోజు ఎన్టీఆర్‌ను చంద్రబాబు వెన్నుపోటు పొడిచిన దానికన్నా దారుణంగా ఈరోజు పవన్ కళ్యాణ్ తన జన సైనికులను, ఫ్యాన్స్‌ని వెన్నుపోటు పొడిచి చంపేశారని గురువారం రాత్రి ఆయన ట్వీట్ చేశారు.

ఉదయ్ బెయిల్ పిటిషన్‌పై తీర్పు 15కు వాయిదా

సాక్షి, హైదరాబాద్: మాజీమంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసులో నిందితుడు (ఏ-6) గజ్జల ఉదయ్‌కుమార్ బెయిల్ పిటిషన్‌పై తీర్పును సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం ఈ నెల 15కు వాయిదా వేసింది. ఈ కేసులో గతనెల 14న ఉదయ్‌ను సీబీఐ అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అనంతరం కోర్టు అనుమతితో ఆరు రోజులు కస్టడీలోకి తీసుకుని విచారించింది. అరెస్టయిన రెండు రోజులకే ఉదయ్‌కుమార్ సీబీఐ కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై గురువారం సీబీఐ కోర్టు మరోసారి విచారణ చేపట్టింది. గత విచారణ సందర్భంగా న్యాయస్థానం ఆదేశాల మేరకు కేసు డైరీని సీబీఐ సమర్పించింది. అనంతరం న్యాయస్థానం తీర్పును వాయిదా వేసింది.

సీఎం రేసులో లేను

టీడీపీతో పొత్తు ఖాయమని పవన్‌కల్యాణ్ సంకేతాలు

- సీఎం పదవి కావాలని అడగాలంటే ఆ స్థాయి ఉండాలి కదా అంటూ వ్యాఖ్యలు
- నాకు సీఎం పదవి ఇస్తానని టీడీపీ ఎలా చెబుతుంది?
- జనసేన బలం తెలిశాక టీడీపీ అధ్యక్షుడి స్థానంలో నేనున్నా ఆ మాట చెప్పను
- అభిమానులు నిరాశ పడడానికి ఇదేమి సినిమా కాదు: జనసేన అధినేత



సాక్షి, అమరావతి/సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం) : వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తాను అసలు ముఖ్యమంత్రి పదవి రేసులోనే లేనని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ పరోక్షంగా తేల్చి చెప్పేశారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీతో జనసేన పొత్తు పెట్టుకోవడం ఖాయమంటూ సంకేతాలిస్తూ, పొత్తుల్లో జనసేన పార్టీకే ముఖ్యమంత్రి పదవి కావాలని అడగడానికి ఓ స్థాయి ఉంటుంది కదా అంటూ వ్యాఖ్యానించారు. మంగళగిరిలోని జనసేన పార్టీ రాష్ట్ర పార్టీ కార్యాలయంలో పార్టీ నేత నాదెండ్ల మనోహర్‌తో కలిసి పవన్ గురువారం మీడియాతో మాట్లాడారు. టీడీపీతో పొత్తు చర్చలు జరుగుతున్నాయి కదా, అవి ఎంతవరకు వచ్చాయని విలేకరులు అడిగిన ప్రశ్నకు బదులిస్తూ.. 'ఖచ్చితంగా పొత్తులు పెట్టుకుంటాం. మాట్లాడతాం. (బీజేపీని ఉద్దేశించి) కొంతమంది ఒప్పుకోకపోవచ్చు. ఒప్పిస్తాం. వాస్తవాలు, గణాంకాలు చూపి ఒప్పిస్తాం'.. అంటూ వ్యాఖ్యానించారు. ఇటీవల చంద్రబాబు-పవన్ భేటీ తర్వాత కొంతమంది జనసేన నేతలు మీరు తగ్గడం ఏమిటని, మీరు ముఖ్యమంత్రిగా అయితే తప్ప పొత్తులు పెట్టుకోకూడదని, మీరు సీఎం అభ్యర్థిగా ఉండాలి కదా అని మాట్లాడడాన్ని పవన్ తప్పుబట్టారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

30–40 సీట్లు వచ్చి ఉంటే సీఎం పదవి అడిగే వాళ్లమేమో..

ముఖ్యమంత్రి స్థాయిలో ఉంటే తప్ప పొత్తులు పెట్టుకోకూడదని అనేవాళ్లు ఎవరైనా సరే, అలాంటి ఆలోచనతో ఉంటే వారు ఒకటి గుర్తుపెట్టుకోవాలి.. జనసేన గత ఎన్నికల్లో 137 స్థానాల్లో పోటీచేసింది. ఎన్ని గెలిచాం? పొత్తుల్లో ఇతర పార్టీలను సీఎం స్థానం కోసం డిమాండ్ చేయాలంటే కనీసం 30–40 స్థానాలు ఉండాలి. అప్పుడే ఆ వాదనకు బలం ఉండేది. ఇక తాను ఇప్పటివరకూ ఎవరికైనా పెద్దన్న పాత్ర వహించాలని చెప్పానంటే అది బాధ్యత వహించడం అని అర్థం. అంతేగానీ, ఒక కులానికి సంబంధించిన వ్యవహారం కాదు. రాష్ట్రానికి సంబంధించిన వ్యవహారమది.

నాతో నడిచే వాళ్లే నా వాళ్లు..

ఇప్పుడు మీరు మాట్లాడిన మాటలకు మీ అభిమానులు, జనసేన కార్యకర్తల నుంచే విమర్శలు ఎదుర్కొనే అవకాశం ఉంటుందేమోనని ఒక విలేకరి (సాక్షి కాదు) అన్నప్పుడు.. 'విమర్శలు వస్తాయని నాకు భయాలు లేవు. అభిమానులు నిరాశ పడడానికి ఇదేమి సినిమా కాదు. కార్యకర్తలైనా సరే.. నాతో నడిచేవారే నా వాళ్లు. అర్థంచేసుకునే వాళ్లు అర్థంచేసుకుంటారు'.. అంటూ పవన్ వ్యాఖ్యానించారు.

సీఎం పదవి కావాలని కండిషన్లు పెడితే జరగవు..

ఒక మాట చెబుతున్నా.. పోయిన ఎన్నికల్లో 137 స్థానాల్లో పోటీచేశాం. 30–40 స్థానాల్లో కూడా గెలిపించలేకపోయారు. అలాంటప్పుడు మన వాదన (సీఎం పదవి కావాలనే)కు పస ఉండదు. సినిమా ల్లో నన్ను ఎవరూ సూపర్‌స్టార్ చేయలేదు. నేను సాధించుకున్నదే. రాజకీయాల్లో కూడా టీడీపీ కావొచ్చు. బీజేపీ కావొచ్చు.. నన్ను సీఎంను చేస్తామని ఎందుకంటారు. నేను టీడీపీ అధ్యక్షుడిని అయినా ఆ మాటలు అనను. మనం బలం చూపించి, సత్తా చూపించి పదవి తీసుకోవాలి. కండిషన్లు పెడితే, అవి జరగవు. సీఎం పదవి అన్నది తానై వరించాలి తప్ప నేను దాని కోసం వెంపర్లాడను. పొత్తులకు జనసేన పార్టీ పెట్టే కండిషను వైఎస్సార్‌సీపీని అధికారం నుంచి దించాలి అంతే. అలాగే, పొత్తులతో ప్రభుత్వం ఏర్పడాలి. నాదెండ్ల మనోహర్ మాట్లాడిన మాటలపై ఎవరైనా అనుచితంగా మాట్లాడితే వాటిని ఉపసంహరించుకోవాలి. ఓటు చీలనివ్వను అంటే ప్రధానంగా బలాలు ఏ పార్టీలకు ఉన్నాయో ఆ పార్టీలు కలవాలన్నది నా ఉద్దేశం. ప్రధాన పార్టీలకు సంబంధించే ఆ వ్యాఖ్యలు చేశాను. ఇక ఎన్నికలు ముందే వస్తాయని అనిపిస్తోంది. అందుకని జూన్ నుంచి రాష్ట్రంలోనే ఉండి పర్యటిస్తా.

చంద్రబాబు పల్లకీ మోయడమే | పవన్ ఎజెండా

- వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి
- కాపుల ఓట్ల కోసం పవన్‌ను ఎరగా వేసిన చంద్రబాబు
- పవన్ చెబుతున్నట్లు ప్రభుత్వ వ్యతిరేక ఓటు లేదు..



సాక్షి, అమరావతి/శంషాబాద్ (హైదరాబాద్) : టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు పల్లకీ మోయడమే తన ఎజెండా అని జనసేన అధ్యక్షుడు, సినీ నటుడు పవన్ కల్యాణ్ చాటి చెప్పారని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. హైదరాబాద్‌లోని శంషాబాద్‌లో, తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాజకీయాలలో కులాల గురించి ఆలోచించడం తప్పని, అయితే చంద్రబాబు అదే చేస్తారని ధ్వజమెత్తారు. టీడీపీకి దూరమైన కాపు సామాజిక వర్గానికి పవన్ కల్యాణ్‌ను ఎరగా వేసి.. ఓట్లు రాబట్టాలని చంద్రబాబు పథకం వేస్తున్నారని ఆరోపించారు. కానీ.. ఆ పథకం చెల్లుబాటు కాదన్నారు. కులాలపరంగా ప్రజలు ఓట్లు వేయరని.. చేసిన సేవ, విశ్వసనీయత ఆధారంగానే ఓట్లు వేస్తారని స్పష్టం చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 151 స్థానాల్లో విజయం సాధించడం.. ఆ తర్వాత స్థానిక సంస్థల ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేయడం, గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజలు బ్రహ్మరథం పట్టడమే అందుకు నిదర్శనమని గుర్తు చేశారు. తాను సీఎం అయితే చూడాలనుకున్న అభిమానులు, కాపు సామాజికవర్గం కలలను చంద్రబాబుకు పవన్ కల్యాణ్ తాకట్టు పెట్టారన్నారు. తమ కలలను పవన్ కల్లలుగా మార్చిన నేపథ్యంలో అభిమానులు, కాపులు వారి వెంట నడవరని స్పష్టం చేశారు. చంద్రబాబు రాజకీయ కుతంత్రంలో పవన్ కల్యాణ్ ఇష్టపూర్వకంగా బలి పశువుగా మారారని చెప్పారు. సజ్జల ఇంకా ఏమన్నారంటే..

చంద్రబాబు కోసమే జనసేన

- సీఎం వైఎస్ జగన్ కంటే ముందే పవన్ కల్యాణ్ రాజకీయ ప్రయాణం ప్రారంభించారు. చంద్రబాబు కోసమే జనసేనను స్థాపించారు. 2014 ఎన్నికల్లో పోటీ చేయకుండా టీడీపీకి మద్దతు పలికారు. 2019 ఎన్నికల్లో ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీల్చడం ద్వారా చంద్రబాబును అధికారంలోకి తేవాలనే లక్ష్యంతో విడిగా పోటీ చేశారు.
- జనసేన పోటీ చేసిన 137 స్థానాల్లోనూ ఆ పార్టీ అభ్యర్థులను చంద్రబాబే ఖరారు చేశారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబును సీఎం పీఠంపై కూర్చోబెట్టడమే ధ్యేయంగా పవన్ పని చేస్తున్నారు. రాజకీయ ప్రస్థానంలో సీఎం వైఎస్ జగన్‌లా ప్రజలతో మమేకమై.. వారి మన్ననలుపొంది, రాజకీయ శక్తిగా ఎదగాలని పవన్ ఎన్నడూ ఆలోచించలేదు. తాను రాజకీయ శక్తిగా ఎదిగితే చంద్రబాబుకు ఇబ్బంది అవుతుందని పవన్ భావించారేమో.

ఒంటరిగా పోటీ చేసే సత్తా లేకే..

- గత ఎన్నికల్లో 175 స్థానాల్లో పోటీ చేసిన టీడీపీ.. గెలిచింది 23 స్థానాల్లోనే. జనసేన పోటీ చేసిన 137 స్థానాల్లో గెలిచింది ఒక్క స్థానమే. ప్రస్తుతం రాష్ట్రంలో ఒంటరిగా 175 స్థానాల్లో అభ్యర్థులను పోటీకి పెట్టలేని దుస్థితిలో చంద్రబాబు ఉన్నారు. టీడీపీ శ్రేణుల్లో నైతిక స్థైర్యం నింపడానికే పొత్తులు అంటూ పవన్‌తో చంద్రబాబు మాట్లాడిస్తుంటారు.
- 2019 ఎన్నికల్లో 30 స్థానాల్లో గెలిపించి ఉంటే.. వచ్చే ఎన్నికల్లో 175 స్థానాల్లోనూ జనసేన అభ్యర్థులను పోటీకి పెట్టేవాడినని పవన్ అనడం అవివేకం. జనసేన ఓటమి బాధ్యత ప్రజలపై వేయడం దుర్మార్గం. ముఖ్యమంత్రి పదవి రేసులో తాను లేనన్న పవన్.. మారీచులైన రామోజీరావు, రాధాకృష్ణ, టీవీ5 నాయుడులతో కలిసి చంద్రబాబును తక్షణమే సీఎం పీఠంపై కూర్చోబెట్టడమే తన ధ్యేయమని చాటిచెప్పుకున్నారు.
- పవన్ చెబుతున్నట్లుగా ప్రభుత్వ వ్యతిరేక ఓటు లేదు. ప్రభుత్వ సానుకూల ఓటు ఉంది. టీడీపీ తరఫున పోటీ చేయడానికే అభ్యర్థులు దొరకకే ముందస్తు ఎన్నికలంటూ బాబు డ్రామాలాడుతున్నారు. ప్రజల ఆశీస్సులతో వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీ విజయం సాధించడం ఖాయం.

అప్పులంటూ అబద్ధాలా?

- ఆర్టిస్ట్ జీవీ రావుకు ఆర్థిక నిపుణుడి ముద్ర
- అలాంటి వ్యక్తి నోటితో బాబు కోసం తప్పుడు లెక్కలు వల్లె
- ఏపీ సీఎం ప్రత్యేక కార్యదర్శి దువ్వూరి కృష్ణ మండిపాటు



సాక్షి, అమరావతి : రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, అప్పులపై ఈనాడు, దాని ఆర్థిక నిపుణుడు జీవీ రావు కథనం పచ్చి అబద్ధాలతో కూడుకున్నదని ఏపీ ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి దువ్వూరి కృష్ణ మండిపడ్డారు. ఎటువంటి గణాంకాలు లేకుండా రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని, అంధకారం అయిపోయిందంటూ జీవీ రావు చేసిన వ్యాఖ్యలను నిర్ధారించుకోకుండానే ఈనాడు ప్రచురించడం తీవ్ర అభ్యంతరకరమని, దారుణమని ధ్వజమెత్తారు. ఎవరికీ పరిచయం లేని వ్యక్తిని ఆర్థిక నిపుణుడంటూ అర్థం లేకుండా మాట్లాడించి.. తప్పుడు కథనాన్ని అచ్చేయడం డ్రామోజీరావు కుట్రలో భాగమని స్పష్టం చేశారు. గణాంకాలను చూపకుండానే రాష్ట్రం శ్రీలంక, పాకిస్తాన్ అయిపోయిందనడం తగదని చెప్పారు. గురువారం ఆయన సచివాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈనాడులో వచ్చిన కథనాన్ని తీవ్రంగా ఖండిస్తూ.. ఆర్‌బీఐ, కాగ్ గణాంకాలను పేర్కొంటూ అప్పులపై వాస్తవాలను వివరించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

ఎవరు ఏం చెబితే అది రాసేస్తారా?

- రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై మూడేళ్లుగా ప్రతిపక్షాలు, వాటి అనుబంధ మీడియా చేస్తున్న దుష్ప్రచారం కొనసాగింపులో భాగంగానే ఎవరికీ పరిచయం లేని వ్యక్తికి ఆర్థిక నిపుణుడనే ముద్ర వేసి నోటికి వచ్చినట్లు మాట్లాడించారు. మళ్లీ ఇదే ప్రభుత్వం వస్తే రాష్ట్రం సర్వనాశనం అయిపోతుందని చెప్పించి, దాన్ని ఈనాడులో ప్రముఖంగా ప్రచురించారు. ఆర్థిక రంగంపై కనీస అవగాహన లేని ఒక చిన్న యాక్టర్ తప్పుడు విశ్లేషణను ఈనాడు బాధ్యతారాహిత్యంగా ఎలా ప్రచురిస్తుంది?
- అప్రకటిత రుణాలు తెచ్చారని జీవీ రావు చెబితే, కనీసం వాస్తవాలు ఏమిటో తెలుసుకోకుండా ఈనాడు ఎలా రాస్తుంది? రూ. 10 లక్షల కోట్ల అప్పులు ఎక్కడున్నాయి? ఎవరు ఏం చెప్పినా, నిర్ధారించుకోకుండానే రాసేస్తారా? అలా రాయడం ఈనాడు దుర్బుద్ధి కాదా? లేక ఈనాడు రామోజీ రావే అలా అబద్ధాలు చెప్పించి, రాయించారా?
- ఆర్‌బీఐ, కాగ్ లెక్కల ప్రకారం బడ్జెట్, బడ్జెట్ బయట, ప్రభుత్వ పూచీ కత్తు, ప్రభుత్వ రంగ సంస్థల అప్పులన్నీ కలిపి రూ.6,51,789.07 కోట్లే. రూ.పది లక్షలు కోట్లు అప్పులని చెప్పడం దుష్ప్రచారం కాదా? మరి మిగతా అప్పులు ఎక్క డున్నాయో ఆ నిపుణుడు, ఈనాడు చెబితే బాగుంటుంది. రాష్ట్ర ప్రతిష్టను దెబ్బతీసే కుట్రలో భాగంగానే అవాస్తవ కథనాలు రాస్తుండటం నిజం కాదా?
- ప్రభుత్వానికి సంబంధించిన డాక్యుమెంట్లన్నీ పబ్లిక్ డొమెయిన్‌లో ఉన్నాయి. వాటిని విశ్లేషించి, అవగాహనతో మాట్లాడితే స్వాగతిస్తాం. కానీ ఏ విశ్లేషణ చేయకుండా, ఎక్కడా లెక్కలు చెప్పకుండా తప్పుడు మాటలు మాట్లాడించి, ప్రచురించడం దారుణం.
- వృత్తిపరంగా అవకతవకలకు (ఒక కంపెనీ తరఫున ఆడిట్లో అవకతవకలు) పాల్పడటంతో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్స్ ఇండియా జీవీ రావును రెండేళ్ల పాటు సస్పెన్షన్ చేసింది. అలాంటి వ్యక్తి ఆర్థిక నిపుణుడంటూ ఈనాడు తెరపైకి తెచ్చి తప్పుడు లెక్కలు చెప్పించడం కుట్రలో భాగమే.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

పేపర్లలో వచ్చిన ఫొటోలను పరిగణనలోకి తీసుకోలేం

మార్గదర్శి పిటిషన్‌లో హైకోర్టు స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో అవకతవకలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ సీఐడీ అధికారులు చేస్తున్న తనిఖీలపై పత్రికల్లో వచ్చిన ఫొటోలను పరిగణనలోకి తీసుకోలేమని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. తదుపరి తనిఖీలు జరిపితే.. సంస్థ రోజువారీ కార్యకలాపాలకు ఇబ్బంది కలగకుండా చూడాలని సీఐడీని ఆదేశించింది. తనిఖీల పేరిట రోజువారీ కార్యకలాపాలను అడ్డుకుంటున్నారని మార్గదర్శి హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ ముమ్మినేని సుధీర్‌కుమార్ గురువారం విచారణ చేపట్టారు. ఏపీ ప్రభుత్వం తరఫున ఏజీపీ ఏబీ లలితా గాయత్రి వాదనలు వినిపించారు. తనిఖీల సమయంలో ఖాతాదారులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించడంలేదని చెప్పారు. చట్ట ప్రకారమే తనిఖీలు జరిగాయన్నారు. పారదర్శకంగా సాగుతున్న దర్యాప్తును అడ్డుకునేందుకు మార్గదర్శి ఇప్పటికే పలు పిటిషన్లు వేసిందన్నారు. పత్రికలో ఏవో ఫొటోలను ప్రచురించి ఖాతాదారులను అడ్డుకుంటున్నామని చూపించే యత్నం చేస్తోందని తెలిపారు. అలాంటి ఫొటోలను, ప్రచురణలను పరిగణనలోకి తీసుకోవద్దని కోర్టును కోరారు. ఏపీలో నమోదవుతున్న కేసులపై ఈ కోర్టు నుంచి ఉపశమనం పొందాలని భావిస్తోందని తెలిపారు. పరిధి లేని పిటిషన్లను విచారణకు స్వీకరించవద్దని, పిటిషన్‌ను కొట్టివేయాలని విజ్ఞప్తి చేశారు.

జిల్లా వార్తలు

నేడు ఫుడ్ ప్రాసెసింగ్ మిషనరీ ప్రదర్శన

ఖమ్మంఅర్బన్: ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార ఉత్పత్తి పథకం–తయారీ సంస్థల క్రమబద్ధీకరణలో భాగంగా శుక్రవారం ఫుడ్ ప్రాసెసింగ్ మిషనరీ ప్రదర్శన ఏర్పాటుచేస్తున్నట్లు ఖమ్మం జిల్లా పరిశ్రమల శాఖ జీఎం కె.అజయ్‌కుమార్ తెలిపారు. ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో ఉదయం 9నుంచి సాయంత్రం 4గంటల వరకు ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. వివిధ కంపెనీల బాధ్యులు పరిశ్రమలకు అవసరమైన యంత్రాలను ప్రదర్శించనుండగా, అర్హులైన వారికి ప్రభుత్వం 35 శాతం సబ్సిడీతో బ్యాంకు రుణాన్ని మంజూరు చేస్తుందని తెలిపారు. ఈమేరకు ఉమ్మడి జిల్లాలోని ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు, రైతులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు హాజరు కావాలని కోరారు.

ఆలయ నిర్మాణానికి రూ.10 లక్షల విరాళం



విరాళం అందజేసిన కోట్యా దంపతులు

కూసుమంచి: మండలంలోని గోరీలపాడులో రామాలయం నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ బానోత్ కోట్యా, సత్య దంపతులు రూ.10,01,116 విరాళం అందజేశారు. విదేశాల్లో ఉంటున్నా కన్న ఊరిపై మమకారంతో భారీ విరాళాన్ని ప్రకటించిన కోట్యా దంపతులను ఎంపీపీ బానోత్ శ్రీనివాస్‌నాయక్, సర్పంచ్ బానోత్ సరస్వతి తదితరులు అభినందించారు.

15 నుంచి ఖమ్మం మార్కెట్‌కు వేసవి సెలవులు

ఖమ్మంవ్యవసాయం: ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ఈనెల 15 నుంచి వచ్చేనెల 3వ తేదీ వరకు ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు సెలవులు ప్రకటించారు. వ్యాపారులు, కార్మిక వర్గాల వినతితో ఏటా మాదిరిగానే ఈ సెలవులు ప్రకటించినట్లు మార్కెట్ చైర్‌పర్సన్ దోరేపల్లి శ్వేత, ఉన్నత శ్రేణి కార్యదర్శి రుద్రాక్షి మల్లేశం వెల్లడించారు. ఈనెల 13న మిర్చి కొనుగోళ్లు పూర్తయ్యాక సెలవులు మొదలుకానుండగా, వచ్చే నెల 5వ తేదీ సోమవారం నుంచి మార్కెట్‌లో యథావిధిగా కొనుగోళ్లు ఉంటాయని తెలిపారు. ఈ విషయాన్ని రైతులు గమనించాలని వారు కోరారు.

ప్లాంటేషన్‌లో అద్భుతమైన ప్రగతి

- పీసీసీఎఫ్ డోబ్రియల్
- భద్రాద్రి జిల్లాలో అభివృద్ధి పనుల ప్రారంభం



అన్నపురెడ్డిపల్లి : మొక్కల పెంపకంపై సూచనలు చేస్తున్న పీసీసీఎఫ్ డోబ్రియల్

పాల్వంచ: ప్లాంటేషన్లను ఏర్పాటు చేయడంలో అద్భుతమైన ప్రగతిని సాధించామని.. రాష్ట్రంలో మాదిరి ప్రపంచంలో మరెక్కడా జరగలేదని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(పీసీసీఎఫ్) ఆర్.ఎం.డోబ్రియల్ తెలిపారు. పాల్వంచలో నిర్మించిన సమావేశం మందిరం, డిప్యూటీ రేంజ్ అధికారి నివాసాన్ని గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో 61 వేల ప్లాంటేషన్లను ఏర్పాటు చేయగా, ఎకో టూరిజం, అర్బన్ పార్క్‌లు, అవెన్యూ ప్లాంటేషన్‌లతో పురోగతి సాధించామన్నారు. అడవులను రక్షించడాన్ని ఉద్యోగులు బాధ్యతగా భావిస్తూ సవాళ్లను నడుమ విధులు నిర్వర్తిస్తున్నారని అభినందించారు.

అబ్బుగూడెం నర్సరీ పరిశీలన

అన్నపురెడ్డిపల్లి: అన్నపురెడ్డిపల్లి మండలం రామవరం రేంజ్ పరిధి అబ్బుగూడెం గ్రామంలోని ఫారెస్ట్ నర్సరీని పీసీసీఎఫ్ ఆర్.ఎం.డోబ్రియల్ సందర్శించారు. నర్సరీలోని మొక్కలను పరిశీలించి, మొక్కల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. అలాగే, ఎండల నేపథ్యాన తీసుకుంటున్న సంరక్షణ చర్యలపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం అబ్బుగూడెంలోని మెగా సర్క్యూట్‌లోని 450 హెక్టార్ల ప్లాంటేషన్లు, మర్రిగూడెం బీట్‌లోని 80 హెక్టార్లలో ఏర్పాటుచేసిన వనాలను కూడా పరిశీలించారు.



పాల్వంచ : సమావేశ మందిరాన్ని భవనాన్ని ప్రారంభిస్తున్న పీసీసీఎఫ్

డీఆర్వో క్వార్టర్ ప్రారంభోత్సవం

ములకలపల్లి: మండలంలోని చాపరాలపల్లి శివారులో అటవీశాఖ నిర్వహిస్తున్న నర్సరీని పీసీసీఎఫ్ డోబ్రియల్ పరిశీలించి నిర్వహణపై సిబ్బందిని అభినందించారు. ఆతర్వాత మండల కేంద్రంలో రూ.23 లక్షల వ్యయంతో నిర్మించిన డిప్యూటీ రేంజ్ ఆఫీసర్(డీఆర్ఓ) క్వార్టర్స్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా పీసీసీఎఫ్‌ను ఉద్యోగులు సన్మానించారు. ఈకార్యక్రమాల్లో భద్రాద్రి సర్కిల్ సీసీఎఫ్ బీమానాయక్, డీఎఫ్ఓ లక్ష్మణ్ రంజిత్ నాయక్, ఎఫ్‌డీఓలు అప్పయ్య, తిరుమల్ రావు, నాగభూషణం, దామోదర్‌రెడ్డి, ఎఫ్ఆర్ఓ ఉమ, అనిల్‌కుమార్, రవికిరణ్, కరుణాకర్‌రెడ్డి, డీఆర్ఓ రామకృష్ణ, రాము పాల్గొన్నారు.

అనాథకు అన్నీ తానై..

- చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయిన రాజు
- పెద్దదిక్కుగా నిలిచి పెళ్లి జరిపించిన ఎంపీ వద్దిరాజు



రాజు, ప్రతిభకు శుభాకాంక్షలు చెబుతున్న ఎంపీ వద్దిరాజు దంపతులు

ఖమ్మంమయూరిసెంటర్: నాలుగేళ్ల వయసులోనే తల్లిదండ్రులను కోల్పోయిన ఆ బాలుడికి ఎంపీ వద్దిరాజు రవిచంద్ర దంపతులే తల్లిదండ్రులయ్యారు. ఆ బాలుడిని అక్కున చేర్చుకుని మంచి భవిష్యత్ కల్పించారు. ఇంట్లో మనిషిలా చూడటమే కాకుండా.. గురువారం తల్లిదండ్రుల స్థానంలో నిలిచి అంగరంగ వైభవంగా వివాహం జరిపించారు. మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తికి చెందిన ఆకుల సత్యం – నాగమ్మ దంపతులకు కుమారుడు రాజు ఉన్నాడు. సత్యం హోంగార్డ్‌గా పనిచేస్తూ జీవనం సాగించేవాడు. కాగా రాజు చిన్నతనంలోనే తల్లిదండ్రులు మృతి చెందగా ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, విజయలక్ష్మి దంపతులు చేరదీశారు. చిన్నప్పటి నుంచి అన్నీ తామే అయి పెంచి పెద్దచేశారు. ఇప్పుడు రాజు వివాహం ప్రతిభతో నిశ్చయం కాగా, ఖమ్మంలోని టీఎన్జీవో ఫంక్షన్ హాల్‌లో గురువారం రవిచంద్ర, విజయలక్ష్మి దంపతులు తల్లిదండ్రుల హోదాలో జరిపించారు. దీంతో రాజు భావోద్వేగానికి గురి కాగా.. ఎంపీ కుటుంబీకులందరూ తమ ఇంటి పెళ్లిగానే భావిస్తూ పాల్గొని సందడి చేశారు.

నేషనల్ హైవే పనులు తనిఖీ చేసిన అధికారులు



నేలకొండపల్లి వద్ద పనులను పరిశీలిస్తున్న కేంద్ర అధికారులు

నేలకొండపల్లి: కోదాడ–కురవి జాతీయ రహదారి పనులను నేషనల్ హైవేస్ అథారిటీ అధికారి జైన్ బర్డ్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం పైనంపల్లి, నేలకొండపల్లి, కొత్తూరు, సింగారెడ్డిపాలెం, గువ్వలగూడెం గ్రామాల వద్ద జరుగుతున్న పనులను పరిశీలించిన ఆయన కూసుమంచి–నేలకొండపల్లి మధ్య వంతెన పనులపై సూచనలు చేశారు. పనుల్లో వేగం పెంచి అనుకున్న సమయానికి లక్ష్యం చేరుకునేలా చూడాలని సూచించారు. అనంతరం కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో జాతీయ రహదారుల అథారిటీకి చెందిన రాష్ట్ర, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'ఓపెన్' ప్రాక్టికల్ పరీక్షలు

ఖమ్మం సహకారనగర్/కొత్తగూడెం అర్బన్: ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యాన ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు ఈనెల 12వ తేదీ నుంచి 19వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు డీఈఓ సోమశేఖర శర్మ, ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు తెలిపారు. ఖమ్మం జిల్లాకు సంబంధించి నయాబజార్ ప్రభుత్వ జూనియర్‌లో 193 మంది, కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 166 మంది పరీక్ష రాయనున్నారని పేర్కొన్నారు. పరీక్షలు ఉదయం 9–30నుంచి 12–30గంటల వరకు, మధ్యాహ్నం 2నుంచి 5గంటలకు వరకు జరుగుతున్నాయని తెలిపారు. ఇదిలా ఉండగా ఈనెల 2వ తేదీన జరగాల్సిన ఇంటర్మీడియట్ ఎకనామిక్స్ తెలుగు మీడియం పరీక్షను రద్దు చేసిన నేపథ్యాన ఈనెల 13వ తేదీ శనివారం ఉదయం 9నుంచి 12గంటల వరకు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. విద్యార్థులు పాత హాల్‌టికెట్‌తో గతంలో పరీక్ష రాసిన కేంద్రాలకే హాజరు కావాలని సూచించారు.

నేటి నుంచి స్పాట్

ఓపెన్ స్కూల్ సొసైటీ వార్షిక పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనం శుక్రవారం నుంచి ప్రారంభమవుతుంది. ఖమ్మం రిక్కాబజార్ పాఠశాలలో నేటి నుంచి పదో తరగతి, ఈనెల 15వ తేదీ నుంచి ఇంటర్మీడియట్ జవాబుపత్రాల మూల్యాంకనం మొదలవుతుందని డీఈఓ వెల్లడించారు.

జాతీయ స్థాయి ఎగ్జిబిషన్‌లో తల్లాడ విద్యార్థి



ఎగ్జిబిషన్‌లో పాల్గొన్న ఉదయ్‌కిరణ్

తల్లాడ: నేషనల్ టెక్నాలజీ డే సందర్భంగా న్యూఢిల్లీలో గురువారం మొదలైన సైన్స్ అండ్ టెక్నాలజీ ఎగ్జిబిషన్‌లో తల్లాడకు చెందిన బాలభారతి విద్యాలయం విద్యార్థి తాళ్లూరి ఉదయ్‌కిరణ్ పాల్గొన్నాడు. గతంలో జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ అవార్డు పొందిన ఉదయ్‌కిరణ్‌కు ఢిల్లీలోని ప్రగతి భవన్‌లో జరిగే ఎగ్జిబిషన్‌లో పాల్గొనే అవకాశం దక్కింది. ఆయన రూపొందించిన చిల్లీ బ్యాగ్ ఫిల్లింగ్ ప్రాజెక్ట్‌ను ప్రదర్శించగా బాలభారతి కరస్పాండెంట్ కోటగిరి ప్రవీణ్, ఎంఈఓ ఎస్.దామోదరప్రసాద్, ఉపాధ్యాయులు అభినందించారు.

తల్లిపై ప్రేమతో మొక్కల పంపిణీ

అన్నపురెడ్డిపల్లి: తల్లిపై ప్రేమ చాటుకోవడంతోపాటు ఆమె జ్ఞాపకాలు నిలిచి ఉండేలా ఓ కొడుకు వినూత్నంగా మొక్కలు పంపిణీ చేశాడు. అన్నపురెడ్డిపల్లి మండలంలోని రాజాపురానికి చెందిన పుచ్చకాయల వెంకటేశ్వరరెడ్డి తల్లి సత్యవతి దశ దినకర్మ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన బంధువులు, గ్రామస్తులకు ఏపీలోని కడియం నుంచి తెప్పించిన పూలు, పండ్ల మొక్కలు పంపిణీ చేశాడు. ఆయా మొక్కలను వారు నాటి సంరక్షిస్తే తన తల్లి జ్ఞాపకాలు పదిలంగా ఉంటాయనే ఆలోచనతో పంపిణీ చేసినట్లు వెంకటేశ్వరెడ్డి తెలిపారు.



మొక్క పంపిణీ చేస్తున్న వెంకటేశ్వరరెడ్డి కుటుంబం

ఘనంగా ఐఏఎస్ అధికారుల వివాహం

కొణిజర్ల: వైరా మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ కుమారుడైన ఐఏఎస్ అధికారి బానోత్ మృగేందర్ లాల్ వివాహం మరో ఐఏఎస్ అధికారి శ్వేతాసుమన్‌తో గురువారం ఘనంగా జరిగింది. వీరిలో మృగేందర్ తమిళనాడు రాష్ట్రంలోని నాగపట్నంలో, శ్వేతాసుమన్ చిదంబరం జిల్లా జాయింట్ కలెక్టర్లుగా విధులు నిర్వర్తిస్తున్నారు. కొణిజర్లలో ఈ వేడుక జరగగా మంత్రులు పువ్వాడ అజయ్‌కుమార్, సత్యవతి రాథోడ్, ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, కలెక్టర్ వీ.పీ.గౌతమ్, సీపీ విష్ణు వారియర్, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, బానోత్ హరిప్రియ, పోదెం వీరయ్య, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మేయర్ పునుకొల్లు నీరజ, జెడ్పీ, డీసీసీబీ, సుడా, మార్కెట్ చైర్మన్లు లింగాల కమల్‌రాజ్, కోరం కనకయ్య, కూరాకుల నాగభూషణం, విజయ్‌కుమార్, దోరేపల్లి శ్వేత తదితరులు వధూవరులను ఆశీర్వదించారు.



వధూవరులను ఆశీర్వదిస్తున్న మంత్రి పువ్వాడ